క్లుప్తంగా

ఐటీఐ కాలేజీ ప్రిన్సిపల్ బదిలీ

పొదలకూరు : స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) కళాశాల ప్రిన్సిపల్ బి.మురళీధర్ సంగం ఐటీఐ కళాశాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బీఎన్ఆర్ పేట చిత్తూరు నుంచి ఎన్వీ సాంబమూర్తిని నియమించారు. ప్రిన్సిపల్ మురళీధర్ సుదర్ఘ కాలం ఇక్కడ పనిచేసి ఐటీఐ నూతన భవన నిర్మాణానికి కృషి చేశారు.

ఎమ్మెల్యే ప్రశాంతి ఉక్కిరిబిక్కిరి

• సమస్యలపై చుట్టుముట్టిన ప్రజలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని పెనుబల్లి ఎస్సీ కాలనీలో సీసీరోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో బుధవారం కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు తమకు ఇళ్ల స్థలాలు, సగంలో ఆగిన నిర్మాణాలు, పింఛన్లు, రోడ్లు, డ్రెయిన్లు తదితర సమస్యలపై ఎమ్మెల్యేను చుట్టుముట్టారు. దీంతో స్థానికులకు సమాధానం చెప్పలేక ఎమ్మెల్యే ఉక్కిరిబిక్కిరయ్యారు. అనంతరం మాట్లాడుతూ కాలనీవాసులు సమస్యలతో సతమతమవుతుంటే అధికారులు, నాయకులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల సమస్యలను అధికారులు, నాయకులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని హెచ్చరించారు. ఈ సంఘటనతో అధికారులు, నాయకులకు ఏం సమాధానం చెప్పాలో అర్థంకాక సతమతమయ్యారు. సమస్యలుంటే అధికారులు, నాయకుల దగ్గరకు వెళ్లాలని, తనకు చెప్పడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే సాయంత్రం 5 గంటలకు పెనుబల్లికి రావాల్సిన ఎమ్మెల్యే గంట ఆలస్యంగా ఆరు గంటలకు రావడంతో ప్రజలు, అధికారులు, నాయకుల అసహనం వ్యక్తం చేశారు.

బిల్డింగ్‌పై నుంచి పడి వ్యక్తి మృతి



అరుల్ మృతదేహం

కోవూరు: కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వ్యక్తి బిల్డింగ్ మూడో అంతస్తు నుంచి కిందపడి మృతిచెందిన ఘటన కోవూరు మండలం పడుగుపాడులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రంలోని ఆరంబాకానికి చెందిన అరుల్(42) తోటపల్లిగూడూరు మండలం ఈదూరుపాళేనికి చెందిన షర్మిలతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ క్రమంలో పడుగుపాడులో ఓ అపార్ట్‌మెంట్ వద్ద బుధవారం కూలి పనికి వచ్చారు. అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డారు. వెంటనే భార్య షర్మిలకు సమాచారం అందించడంతో ఆమె ఘటనా స్థలానికి చేరుకుంది. అప్పటికే సహచర కూలీలు ఆటోలో కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రి వద్దకు వచ్చిన భార్య షర్మిల భర్త మృతిపై అనుమానాలు వ్యక్తం చేసింది. శరీరంపై గాయాలు ఉన్నట్లు కోవూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు.

చిరుతపులి ఎలా చనిపోయిందో..?

కలువాయి(సైదాపురం): మండలంలోని చింతలాత్మకూరులోని దక్షిణ కాలువలో గత నెల 28వ తేదీన చిరుతపులి చనిపోయి కొట్టుకొచ్చిన విషయం తెలిసిందే. స్థానికులు దానిని బయటకు తీశారు. కాగా చిరుత మృతికి గల కారణాలను అటవీ శాఖ అధికారులు నేటికీ బయట పెట్టడంలేదు. నీరు తాగేందుకు కాలువలో దిగి చనిపోయిందా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే అనుమానాలున్నాయి. కాగా గ్రామ శివారుల్లో చిరుత పులులు సంచరిస్తున్నాయని ప్రజలు భయపడుతున్నారు. అటవీ శాఖాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మార్కెట్ ప్రాంగణంలో శుభ్రత పాటించాలి

నెల్లూరు(బారకాసు): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. మార్కెట్ ప్రాంగణాన్ని బుధవారం పరిశీలించిన అనంతరం అక్కడ చేపట్టిన పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి దుకాణంలో చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకొని, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను వేయడాన్ని పూర్తిగా మానుకోవాలని సూచించారు. అనంతరం గుండ్లపాళెంలోని లేఅవుట్‌ను సందర్శించారు.

22న నాయీబ్రాహ్మణ సర్వసభ్య సమావేశం


నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు జిల్లా నాయీబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి సంఘ సర్వసభ్య సమావేశాన్ని నవాబుపేటలోని మద్దులూరి వీరరాఘవయ్య కల్యాణ మండపంలో ఈ నెల 22న నిర్వహించనున్నామని నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి హాజరుకావాలని, వివరాలకు 99633 24585 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వరవ నీరు వాగుపాలు

• కాలువను బాగుచేస్తే చెరువుకు పుష్కలంగా నీరు
• వర్షాలకు ముందే రిపేర్లు చేస్తే మేలు
• ఇటీవల పూడిక తొలగింపు పనులు
• అడ్డంకిగా ఆక్రమణలు



మురుగుకాలువగా మారిన చెరువు సప్లై చానల్



గతంలో కాలువకు పడిన గండి (ఫైల్)

పొదలకూరు : ఏటా వర్షాకాలంలో పొదలకూరు చెరువు వరవ(సప్లై చానల్) కాలువ నీరు వాగుపాలు అవుతున్నాయి. ఈ కాలువ నుంచి నీరు మధ్యలోనే లేఅవుట్ మీదుగా వాగులో పడి పార్లపల్లి చెరువుకు వెళ్తున్నాయి. పొదలకూరు, లింగంపల్లి రైతులు కాలువను బాగుచేయమని చాలా పర్యాయాలు విజ్ఞప్తులు చేశారు. అయితే ఇటీవల కాలువ పూడిక తొలగింపు పనులు నిర్వహించారు. పట్టణం నడిబొడ్డున కాలువ ఉండడంతో వ్యర్థాలతో కాలువ నిండిపోతోంది. ఫలితంగా కొద్దిరోజుల్లోనే కాలువలో పూడిక చేరుకోవడం వల్ల నీరు సజావుగా సాగడం లేదని రైతులు వాపోతున్నారు. జలవనరులశాఖ అధికారులు నామమాత్రపు మరమ్మతులతో సాగదీస్తున్నారు. ఏళ్ల తరబడి కాలువ గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో మురుగు కాలువగా మారి కంపుకడుతోంది. పొదలకూరు చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువు వర్షాకాలంలో నిండేందుకు వరవకాలువ ప్రధానంగా ఉపయోగపడేది. పొదలకూరు–నెల్లూరు మార్గంలో కాలువ ప్రారంభమై పట్టణంలోని పలుప్రాంతాల్లో మలుపులు తిరుగుతూ చెరువుకు చేరుకుంటుంది. క్రమంగా పట్టణం విస్తరించి కాలువ కబ్జాకు గురైంది.

వర్షాలకు ముందే రిపేర్లు చేయాలి

వర్షాలకు ముందే కాలువకు రిపేర్లు చేస్తే చెరువులోకి నీరు చేరేందుకు అవకాశం ఉంటుంది. చెరువు నిండేందుకు వరవ కాలువ ఒక్కటే ఆధారం. ఎడమగట్టు కాలువకు ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేసినా చెరువుకు నీరు సరఫరా అయ్యే పరిస్థితి లేదు. దీంతో చెరువు నిండేందుకు కాలువపైనే ఆధారపడాల్సి వస్తోంది. భారీ వర్షాలు కురిస్తే కాలువకు గండ్లు పడుతున్నాయి. పూడికతో నిండిన కాలువ గుండా చెరువుకు నీరు చేరాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో కూడా ఒకటి, రెండు పర్యాయాలు కాలువ పూడికతీత పనులు చేపట్టారు.

మురుగు కాలువగా రూపాంతరం

పట్టణం మీదుగా సప్లై చానల్ ఉండడం వల్ల ఆక్రమణలతో పాటు వ్యర్థాలు, ఇళ్లలోని మురుగునీటిని కాలువకు వదులుతుండడం వల్ల మురుగు కాలువగా సప్లై చానల్ రూపాంతరం చెందింది. దీంతో కొత్త వారు చూస్తే డ్రెయినేజీ కాలువగా అభిప్రాయపడుతున్నారు. ఇళ్ల మధ్య గుండా వెళ్తున్న కాలువ నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. ఆక్రమణల వల్ల కాలువ వెడల్పు కూడా కుచించుకుపోయింది. లే-అవుట్లలో కూడా కాలువ వెళ్తుండడంతో కొందరు కాలువను కలిపేసుకున్నట్టు రైతులు వెల్లడిస్తున్నారు. వర్షాకాలంలోనైనా కాలువ గుండా సాగునీరు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలంటున్నారు.

పూడిక తొలగించాం

ఇటీవల కాలువలో పేరుకున్న పూడిక తొలగించాం. అడ్డంకిగా ఉన్న ఆక్రమణలను తొలగించాల్సిందిగా హెచ్చరించాం. గతేడాది లేఅవుట్లో ఉన్న కాలువను తిరిగి తవ్వించాం. కొత్తగా ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే వెంటనే చర్యలు తీసుకుంటాం. చెరువుకు సప్లై చానల్ గుండా నీరు వెళ్లేందుకు అన్నిచర్యలు తీసుకుంటాం.

– అనిల్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ, పొదలకూరు

మడవకట్టు వద్ద ఘర్షణ

• వ్యక్తిపై దాడి

పొదలకూరు : మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామం సోమశిల కాలువ మడవకట్టు వద్ద ఇద్దరి మధ్య ఘర్షణ జరిగి ఒకరిపై మరొకరు కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు వివరాలు.. ఎడగారు పైర్లు పెట్టుకునేందుకు సోమశిల దక్షిణ కాలువకు నీటిని విడుదల చేయడంతో గ్రామానికి చెందిన కోడూరు పెంచలరెడ్డి, అదే గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన సీహెచ్ వెంకటేశ్వర్లు మడవకట్టు వద్దకు సోమవారం రాత్రి వెళ్లారు. నీరు పెట్టుకునే విషయంలో ఇద్దరి మధ్య గొడవ నెలకొంది. దీంతో వెంకటేశ్వర్లుపై పెంచలరెడ్డి కత్తితో దాడికి పాల్పడ్డాడు. వెంకటేశ్వర్లుకు భుజం, చేతిపై గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై బుధవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం

కొడవలూరు: స్థానిక దళితవాడలో కొలువైన ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి బుధవారం ఉదయం విశేష పంచామృతాభిషేకం, సహస్ర నాగవల్లీ దళార్చనలు నిర్వహించారు. సాయంత్రం చందనాలంకరణ గావించి, పూలంగి సేవలు జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు స్వామివారి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు




మనుబోలు: మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వరరావు

మనుబోలు: ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించడం వల్ల రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చని హైదరాబాద్‌కు చెందిన భారత వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ డీవీకే నాగేశ్వరరావు అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మనుబోలు రైతు సేవా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వ్యవసాయంలో ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం గురించి వివరించారు. ఆగ్రో జియో ఇన్ఫర్మేటిక్స్ వ్యవస్థ అవసరం గురించి వివరించి, ఎలా తయారు చేసుకోవచ్చనే విషయాన్ని తెలియజేశారు. గ్రామీణ స్థాయిలో డిజిటల్ మ్యాప్స్ ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. పచ్చిరొట్ట విత్తనాల ద్వారా భూసారం పెంచుకోవచ్చని తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ మధుసూదన్ వరిసాగులో నూతన వంగడాలు, మేలైన యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. మత్స్య శాస్త్రవేత్త హరిసాధు చేపల పెంపకంపై అవగాహన కల్పించారు.

• వెంకటాచలం : మండలంలోని గొలగమూడి గ్రామంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అధికారులు అవగాహన కల్పించారు. నారుమడుల యాజమాన్యం, రసాయన ఎరువుల వాడకం, భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త లోకేష్ అవగాహన కల్పించారు. ఈ సదస్సులో మండల వ్యవసాయాధికారి హరికరుణాకర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏడీ సుబ్రహ్మణ్యం

మనుబోలు: పీఎం సూర్యఘర్ పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో పొదలకూరు డివిజన్ ఏడీ సుబ్రహ్మణ్యం అన్నారు. మనుబోలు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ పవర్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం రాయితీ ఇస్తోందని తెలిపారు. దీనిద్వారా వినియోగదారులకు ప్రతినెలా కరెంటు బిల్లుల భారం తగ్గుతుందన్నారు. సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకులు రుణం కూడా ఇస్తాయన్నారు. ఈ పథకం లబ్ధిదారులు బీసీలైతే రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు అదనంగా రాయితీ ఇస్తుందన్నారు. ఆయన వెంట లైన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ఉన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కొడవలూరు: మండలంలోని పెయ్యలపాళెంలో రూ.కోటి నిధులతో నిర్మించనున్న రోడ్డు పనులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం శంకుస్థాపన కావించారు. పల్లె పండగలో భాగంగా గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో నీటి సమస్య లేకుండా పరిష్కరించామన్నారు. తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి, ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు, టీడీపీ నేతలు జీవీఎస్ శేఖర్‌రెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, పండిటి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

మనుబోలు: ప్రభుత్వ లేఅవుట్‌లలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను అదనపు నగదుతో జూన్ 22లోపు పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ జలజాక్షి లబ్ధిదారులకు సూచించారు. ఆమె తన కార్యాలయంలో బుధవారం హౌసింగ్ ఏఈ శరత్‌బాబు, సిబ్బందితో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం జట్లకొండూరు గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. జూన్ 22 నాటికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయించాలని అధికారులకు సూచించారు. ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు మంజూరు చేసిందని తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఆమె వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనా నాయక్ ఉన్నారు.

నేత్రపర్వం.. చాముండేశ్వరి కల్యాణం



అమ్మవారి కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు



పాల్గొన్న భక్తులు

• వీక్షించి పులకించిన భక్తులు

ఇందుకూరుపేట: వేదపండితుల మంత్రోచ్చారణలు.. మంగళ వాయిద్యాల నడుమ చాముండేశ్వరి సమేత త్రిశూలేశ్వరస్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నంలో ఉన్న చాముండేశ్వరిదేవి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టం కల్యాణోత్సవాన్ని బుధవారం వేకువజామున శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లను పుష్పాలతో విశేషంగా అలంకరించి భక్తుల కేరింతల నడుమ గ్రామం నుంచి ఆలయానికి తీసుకొచ్చారు. మండపంలో కొలువుదీర్చి సాంప్రదాయబద్ధంగా కల్యాణ వేడుకను జరిపారు. దేవదేవేరుల కల్యాణాన్ని వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి మొదలైన వేడుక బుధవారం ఉదయం వరకు సాగింది. అనంతరం అమ్మవారికి పూలంగి సేవ ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించేందుకు భక్తులు క్యూ కట్టారు. పూలంగి సేవకు ఉభయకర్తలుగా ప్రవాస భారతీయులు పిళ్లారిశెట్టి వెంకటనాగ సందీప్– సింధూర దంపతులు వ్యవహరించారు. ఆలయ అర్చకులు నూతలపాటి అనిల్ కుమార్‌శర్మ, మాచవోలు రామకృష్ణ, ముప్పిరాల కిశోర్, యాజ్ఞికులు మున్నూరు మల్లికార్జున గురుకుల్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. రాత్రి ఆలయ ఆవరణలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి తాతా శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వేడుకగా వసంతోత్సవం

ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి వసంతోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం త్రిశూలేశ్వరస్వామి ఉత్సవం, గంగోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కాగా గంగోత్సవానికి ఉభయకర్తలుగా స్థానిక యాదవులు వ్యవహరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలకమైన ఘట్టం రథోత్సవం(సిరిమాను) గురువారం రాత్రి జరుగనుంది. ఈ సందర్భంగా అగ్నిగుండం, ధ్వజా అవరోహణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తొలుత ఉదయం తీర్థవాది సముద్రస్నానం పూజలు జరుగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు.

దళిత సర్పంచ్‌పై చిన్నచూపు

• ప్రొటోకాల్ ఉల్లంఘన

విడవలూరు : దళితులంటే తెలుగుదేశం పార్టీకి చిన్నచూపు అని మరోసారి రుజువైంది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం విడవలూరు, అన్నారెడ్డిపాళెం గ్రామాల్లో పంచాయతీ రోడ్లకు బుధవారం శంకుస్థాపన చేశారు. అయితే అన్నారెడ్డిపాళెం నుంచి వరిణి గ్రామానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకంలో అన్నారెడ్డిపాళెం సర్పంచ్ బండ్ల కవిత పేరు ఉంది. అదేవిధంగా విడవలూరు నుంచి వావిళ్ల గ్రామానికి ప్రారంభించిన శిలాఫలకంలో స్థానిక దళిత సర్పంచ్ యేటగిరి ప్రవీణ్‌కుమార్ పేరు కాకుండా ప్రొటోకాల్ ఉల్లంఘించి టీడీపీ మండలాధ్యక్షుడు సతీమణి వావిళ్ల సర్పంచ్ ఏటూరు రాజేశ్వరి పేరు ఉంది. దీంతో అప్పటివరకు ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు దళిత నాయకులు ఆయనకు జరిగిన అవమానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

• ఈ విషయంపై సంబంధిత అధికారులను వివరణ కోరగా ఈ రోడ్డు వేయడం ద్వారా వావిళ్ల గ్రామస్తులకు లబ్ధి కలుగుతుందని, అందువల్లే వావిళ్ల సర్పంచ్ పేరును శిలాఫలకంపై వేసినట్లు తెలియజేశారు. అయితే అన్నారెడ్డిపాళెం నుంచి వరిణి గ్రామానికి ప్రారంభించిన శిలాఫలకంలో లబ్ధిదారులు వరిణి గ్రామస్తులు కావడంతో అక్కడి సర్పంచ్ పేరును మాత్రమే వేయాలి. కానీ అధికారులు ఇద్దరు సర్పంచ్ పేర్లు వేశారు. కానీ విడవలూరులో మాత్రం కేవలం వావిళ్ల సర్పంచ్ పేరు మాత్రమే వేశారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

విడవలూరు: రైతుల తొలి పండగ అయిన ఏరువాక పౌర్ణమి మండలంలోని చౌకచర్ల గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హాజరై, ఎడ్ల బండిపై తిరుగుతూ రైతుల వ్యవసాయ పనిముట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

యువకుల గల్లంతు

• రక్షించిన మెరైన్ పోలీసులు



గల్లంతైన యువకుడిని ఒడ్డుకు చేర్చిన మెరైన పోలీసులు

తోటపల్లిగూడూరు: సముద్రంలో గల్లంతైన ఇద్దరు యువకులను మెరైన్ పోలీసులు రక్షించిన ఘటన బుధవారం కోడూరు బీచ్‌లో వెలుగు చూసింది. మెరైన్ ఎస్సై అంజిరెడ్డి కథనం మేరకు.. కోవూరు మండలం లేగుంటపాడుకు చెందిన గున్నం ఉదయ్ కుమార్, కరేటి వినయ్‌కుమార్‌లు బుధవారం కోడూరు బీచ్ సందర్శనకు విచ్చేశారు. సరదాగా సముద్రంలో మునుగుతున్న సమయంలో అలల తాకిడికి ఇద్దరూ సముద్రంలో కొట్టుకుపోతూ కాపాడండి అంటూ కేకలు వేశారు. ఈ క్రమంలో అందుబాటులో ఉన్న మెరైన్ పోలీసులు స్థానికుల సహకారంతో సముద్రంలో కొట్టుకుపోతున్న ఇద్దరు యువకలను రక్షించి ఒడ్డుకు చేర్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారిని మెరుగైన వైద్య పరీక్షల కోసం నెల్లూరుకు తరలించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి ఇద్దరు యువకుల ప్రాణాలు కాపాడిన పోలీస్ సిబ్బందిని మెరైన్ ఎస్సై అంజిరెడ్డితో పాటు స్థానికులు ప్రశంసించారు.

ఘనంగా యోగా డే

నెల్లూరు(అర్బన్): ఒత్తిడి లేని ఆరోగ్యవంతమైన దేశం కోసం ప్రతి ఒక్కరూ యోగా చేయాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ నేపథ్యంలో నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ర్యాలీని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్, ఫీల్డ్ ఆఫీస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో పాటు డాక్టర్లు యోగా చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడారు. యోగా చేయడాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కోరారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ క్షేత్ర ప్రచార సహాయకుడు హరికృష్ణ, నెల్లూరు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఏపీ టూరిజం అధికారి ఉషశ్రీ, ఎస్‌ఐసీ జిల్లా అధికారి సురేష్‌బాబు, ఎల్డీఎం మణిశేఖర్, జిల్లా యూత్ ఆఫీసర్ మహేంద్రరెడ్డి, పతంజలి ఇన్‌చార్జి విజయకుమార్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, డాక్టర్ శివరాములు, యోగా ట్రైనర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

